# మొగాడు
# నా మొగుడు

అబద్ధమాడితే ఆడపిల్లలు పుడతారని ఎవరన్నారోకాని గొప్ప దూరదృష్టి. అనుభవం కల మహానుభావుడై ఉండాలి. ఆడపిల్ల పుట్టడం! మైగాడ్! ఎంతటి భయంకరమైన శిక్ష? పుట్టబోయేది ఆడబిడ్డని తెలిస్తే గర్భవిచ్ఛిత్తి చేయించుకుని భ్రూణహత్యకు కూడా వెనుదీయడం లేదంటే ఆశ్చర్యం ఏముందీ?

మాది చింతలు లేని కుటుంబం కాకపోయినా చిన్న కుటుంబమే. మా అమ్మ, నాన్న, అన్నయ్య, అక్కయ్య, ఆఖరిదాన్ని నేను మా నాన్న రిటైర్ అయినప్పటికి మా అన్నయ్య, అక్కయ్య పెళ్ళిళ్ళయిపోయాయి. ఇప్పుడు నా పెళ్ళి కూడా జరిపించేసి గుండెల మీద కుంపటి దించేసి ఆర్పెయ్యవచ్చునని ఆ ఘడియ కోసమే ఎదురు చూస్తున్నారు మా అమ్మా, నాన్నా.

మాకు ఆస్తిపాస్తులు లేకపోయినా మా అన్నయ్య ఇంజనీరు కాబట్టి ఓ పెద్ద ఆఫీసర్‌గారి అల్లుడయ్యాడు. ఆదర్శాలకు కట్టుబడి కట్నం తీసుకోలేదు. రిటైరయ్యే ముందు మా అక్కయ్య పెళ్ళి కూడా రాబోయే ప్రావిడెంటు ఫండ్, గ్రాట్యుటీ దృష్టిలో ఉంచుకుని అప్పుచేసి, కట్నం కానుకలతో ఘనంగానే జరిపించి ఓ పెద్దింటి కోడల్ని చేశారు ముందుచూపు లేక కాదు - వియ్యంకుల అంతస్తులకు తగ్గట్టు కాస్త ఆడంబరాలకు పోవడం వల్లా, అన్నింటికి ఆ భగవంతుడే ఉన్నాడన్న వేదాంత ధోరణి వల్లా, గండిపడిన ప్రవాహంలాగ పొంగి పొర్లే ఖర్చులను మా నాన్న అదుపులో పెట్టలేకపోయాడు. మా అన్నయ్యకి అప్పటికే ఓ ఆడపిల్ల పుట్టడంతో సహజంగానే ముందు జాగ్రత్త ఉన్నవాడు కాబట్టి మా అక్కయ్య పెళ్ళి ఖర్చులలో తల దూర్చలేదు. మరి నా పెళ్ళిప్పుడు సమస్యనుకుంటే సమస్యే.

నేను చాలా అందమైనదాన్నని ఆత్మవంచన చేసుకోలేను. అలా అని అనాకారిని కాదు. నేను ఎం కామ్. ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మా ఏడుగురు స్నేహితుల బృందంలోనూ అందచందాల్లో నాది నాలుగోస్థానం అనుకుంటా. ఎంచేతంటే సుజాత, గ్లాడిస్, పద్మినీ నాకంటే నిస్సందేహంగా అందమైన వాళ్ళే. శరీరఛాయ, అంగ సౌష్టవం, కళ్ళూ, ముక్కూ, నోరు తీరుల్లో మొత్తంమీద వాళ్ళకున్న ఆకర్షణ నాలో లేదు. మా నాన్న అన్నయ్య ఇచ్చిన ప్రోత్సాహంతో వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లోనూ చాలా బహుమతులు సంపాదించుకున్నాను. అంతేకాదు - నా కథలు, వ్యాసాలు పత్రికల్లో పడేవి. అంచేత మా స్నేహితు లందరికీ నేనంటే ఒక ప్రత్యేకమైన అభిమానముంది.

చదువు పూర్తయిన కొత్తలో తడిబట్టల్లోనూ, నగ్నంగానూ నిలువుటద్దం ముందు నిలబడి రకరకాల కోణాల్లో నన్ను నేను చూసుకుంటూ, తడుముకుంటూ "నాన్‌సెన్స్! నేనందంగా లేకపోవడ మేమిటి? కట్నం ఇవ్వలేకపోయినంత మాత్రాన నాకు పెళ్ళికాకపోవడమేమిటి? వీటన్నిటినీ సొంతం చేసుకోవడానికి ఏ అదృష్టవంతుడు కాచుక్కూర్చున్నాడో?" అనుకుంటూ ఊహల్లో తేలిపోతుండే దాన్ని. ఈ రెండేళ్ళ అనుభవంలోనూ పెళ్ళి జరగాలన్నా, ఉద్యోగం దొరకాలన్నా కాని, చదువు, తెలివితేటలు, ఆత్మవిశ్వాసంతోపాటు అదృష్టం కూడా ఉండాలని గ్రహించాను.

*  *  *

నిర్మల పెళ్ళికి వెళ్ళినప్పుడు మా స్నేహితులందరూ "ఇంకా ఎన్నాళ్ళే ఈ బ్రహ్మచర్యం? త్వరగా ఓ ఇంటి దానివవ్వు" అంటూ నన్ను చుట్టుముట్టారు. తల్లిదండ్రులు, తోబుట్టువు కలుగజేసుకుని మంచి పెళ్ళికొడుకుని చూసి విందులూ, వినోదాలు, కట్నాలు, కానుకల్తో వైభవంగా పెళ్ళి జరిపించే అదృష్టానికి నోచుకున్న వాళ్ళే వీళ్ళందరూ. ఇటీవల మా అమ్మా, నాన్న నాకు రెండో పెళ్ళివాడి సంబంధాలు కూడా చూస్తున్నారు. ఎంచేతనంటే, పెళ్ళవ్వక పోయినా సరే కాని-నేను మాత్రం కట్నం తీసుకునే దరిద్రగొట్టు వెధవనిమాత్రం పెళ్ళాడనని గట్టిగా చెప్పాను మరి. మనసున్న తోటి మనిషిగా నా వ్యక్తిత్వాన్ని గుర్తించి గౌరవించే సంస్కారం ఉన్న వ్యక్తి కూలినాలి చేసుకునేవాడైనా చేసు కుంటాను కాని, పెళ్ళి నొక వ్యాపారావకాశంగా అడదాని దగ్గరనుంచి డబ్బు ఆశించే పరమ నీచుణ్ణి కాలితో కూడా తాకకూడదన్నది నా మతం.

''మీ అన్నయ్య మంచి పొజిషన్‌లో ఉన్నాడు మీ అక్కయ్య మొగుడు పెద్ద బిజినెస్ మాగ్నెట్. నువ్వు ఉద్యోగం వెలగబెడుతున్నావు. మరింకేమిటే ఆలస్యం? స్వయంవరం ప్రకటిస్తున్నావా?'' అంది చంద్రిక.

''ఇది టెంపరరీ జాబ్. నేనింకా ఉద్యోగంలో స్థిరపడలేదు. ఇంక మా నాన్న, అన్నయ్య, అక్కయ్యల సహాయం కోరడం నా ఆశయానికి విరుద్ధం'' అన్నాను.

''నీ ఆశయం తగలెయ్యా! ఇదేమీ వ్యాసాలు రాయడం, ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. ఇది నిజ జీవితం. పెళ్ళంటే మాటలా? నీ సంపాదనతోనే పెళ్ళాడాలనుకుంటే అలోగా మే మందరం అమ్మమ్మ లవుతాం'' అంది సుహాసిని.

''ఓ పన్జెయ్యి. మా అందరి కోరికా మన్నించి మంచి పెళ్ళికొడుకుని ఎంచుకో. మీ వాళ్ళ సహాయం అడక్కు. నీ పెళ్ళంటే మా అందరికీ పండుగే. చడీ చప్పుడు లేకుండా మే మందరం తలో చెయ్యివేసి లాగించేస్తాం'' అంది శోభ.

''ఓ ఎస్!'' అన్నారు అందరూ నిండు హృదయాలతో.

అలాంటి అవసరం వస్తే సహాయం చెయ్యాలనుకునే స్నేహశీలులే వీళ్ళందరూ. అయితే వీళ్ళ పెళ్ళిళ్ళయ్యాక వీళ్ళకేపాటి ఆర్థిక సామర్థ్యం, స్వాతంత్ర్యం ఉంటాయో మా అన్నయ్య అక్కయ్యల జీవితాల్ని చూస్తే తెలుస్తూనే ఉంది. ''సరే. పెళ్ళికొడుకు దొరగ్గానే మీ అందరికీ తెలియబరుస్తాను. సిద్ధంగా ఉండండి'' అన్నాను వాళ్ళ నవ్వులతో శ్రుతి కలుపుతూ.

* * *

నా స్నేహితుల్లో నిర్మల నాకు చాలా సన్నిహితురాలు. మా వీధి చివరే వాళ్ళ బంగళా, నిర్మల తండ్రి బిల్డింగ్ కంట్రాక్టర్. బాగా సంపాదిస్తున్నాడు. రెండు కార్లూ, జీపూ, రెండు లారీలు, ట్రాక్టరు, వచ్చిపోయే వాళ్ళు, రెండు అల్సేషియన్ కుక్కలతోనూ వాళ్ళిల్లు ఎప్పుడూ సందడిగా ఉంటుంది. ముప్పయి మైళ్ళ దూరంలో వాళ్ళకో పెద్దతోట, అందులో గెస్ట్‌హౌస్ ఉన్నాయి. నెలకి రెండు మూడు ఆదివారాలు నాతోపాటు ఓ అరడజను మందిని పోగుచేసి నిర్మల వాళ్ళ తోటకు తీసుకుపోతుంది. సాయంత్రం వరకూ అక్కడే ఉండి తలో బుట్ట

లోనూ పళ్ళూ, కూరగాయలతో తిరిగొస్తూ ఉంటాం. భగవంతుడు ఐశ్వర్యంతో పాటు పదిమందితో ఆనందం పంచుకునే ఉదార బుద్ధి కూడా దాని కిచ్చాడు. నేనంటే దానికి పిచ్చి అభిమానం. రెండు మూడు రోజులకో సారైనా మా ఇంటి కొచ్చి నన్ను వాళ్ళింటికి పిలుచుకుపోయేది. దాని పెళ్ళి చూపులక్కూడా నేను ఉన్నాను. ఇంపోర్టెడ్ పెళ్ళికొడుకు, గ్రీన్‌కార్డ్ హోల్డర్. అక్కడే ఇంజనీరింగ్ పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతని తల్లిదండ్రులు చాలా సన్నిహిత మిత్రులు. కుర్రాడు నలుపైనా కళైన మొహం. ఇంకో నాలుగైదేండ్లు అమెరికాలో సంపాదించగలిగినంత డబ్బు, టెక్నాలజీ సంపాదించుకుని తిరిగొచ్చి ఇక్కడ పరిశ్రమ మొదలు పెడతాడట. నిర్మలని చేసుకోడానికి ఒప్పు కుంటాడో, లేదో అని భయపడ్డాను. నిర్మలకి బాహ్య సౌందర్యం కంటే ఆత్మ సౌందర్యం ఎక్కువ. అయితే, కల్పవృక్షంలాంటి ఆస్తి ఉంది. మొత్తం మీద ఆ సంబంధమే కుదిరింది. వెంటనే చెప్పకపోయినా వారం రోజుల తర్వాత, బహుశా మరో నాలుగైదు సంబంధాలు చూశాక పిల్ల నచ్చినట్టు కబురు చేశారు.

నిర్మల పెళ్ళిలో 'ఆంధ్రవాణి' పత్రికా సంపాదకుడు చంద్రశేఖర్‌తో పరిచయమైంది. పెళ్ళికొడుకుకి బంధువులు. నా కథలు, వ్యాసాలు ఆ పత్రికకే పంపుతూ ఉంటాను. నేను ఫలానా అని నిర్మల చెప్పగానే నా రచనల గురించి పొగుడుతూ నన్నభినందించాడు. ఈసారి కథతోపాటు నా ఫోటో కూడా పంప మన్నాడు. ఆయనకి ముప్పయ్యయిదేళ్ళుంటాయి. మంచి పేరుతోబాటు 'పర్స నాల్టీ' కూడా ఉంది. జర్నలిజంకి అంకితమైన మనిషి, పెళ్ళి కూడా చేసుకోలేదట.

నా కొత్త కథ 'మొగాడు నా మొగుడు'కి మంచి ప్రచారం ఇచ్చాడు. కవర్ పేజీ మీద కథ పేరు. నా పేరు వేశారు. లోపల నా వివరాలూ, ఫోటో కూడా వేశారు. దానికి తగ్గట్టుగా కథ కూడా కొంత సంచలనం సృష్టించింది. కథలో ప్రత్యేకత ఏమీ లేదు; మామూలు అత్తా కోడలోపాఖ్యానం. కట్నాలు, లాంఛనాలు, ఎదురు సన్నాహాలు. వెండి కంచం, చెంబు, పానకం బిందెలు, అలకపాన్పు, అప్పగింతలు, సారెలులాంటి తంతులు వేద మంత్రాలలో ఎక్కడా లేవు. మధ్యలో మొగాడు తన ఆధిక్యాన్ని ప్రదర్శిందుకోడానికి సృష్టించిన తతంగం ఇదంతా.

విటుణ్ణి వెధించే వేశ్యలాగ, పుట్టింటి నించి అవి తే, ఇవి తే అంటూ పీడి స్తుంటే ఈ గొంతెమ్మ కోరికలన్నీ తీరుస్తూ భార్య భర్తని 'ఉంచు'కున్నట్టవుతుంది కాని సహధర్మచారిణి కాలేదు.

ఇలాంటి పరిస్థితుల్లో భార్య భయంతోనో, అభిమానంతోనో, లోకు లేమంటారో అన్న పిరికితనం వల్లనో ఈ అవమానాల్ని భరించలేక ఇంట్లో మూల కూర్చుని కుమిలి కుమిలి ఏడవడం, ఆత్మహత్యా ప్రయత్నాలను గురించి ఆలోచించడం మానేసి మొగుణ్ణి వీధుల్లోకో, అవసరమైతే కోర్టుకో ఈడ్చాలన్నదే ఈ కథ సందేశం.

వరకట్నాల సమస్యల్ని గురించి 'ఆంధ్రవాణి' ఒక గోష్ఠి నిర్వహించ దల్చుకున్నట్లూ, దానికి నన్ను కన్వీనర్‌గా ఉండమని కోరుతూ చంద్రశేఖర్ గారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం నిర్మలకి చూపెట్టాను. "ఏమిటో! ఆశయాలు ఆకాశాన్నంటుతాయి - ఆచరణలు పాతాళంలో ఇంకి పోతున్నాయి. నీ కథల ధర్మమా అని నీ కొచ్చిన పేరుతో నిన్నెవడూ పెళ్ళి చేసుకోడు" అంది నా భవిష్యత్తు గురించి హెచ్చరిస్తూ. ఈ గోష్ఠి గురించి వివరాలు తెలుసుకుందామని నిర్మల ఇంట్లోంచే చంద్రశేఖర్‌కి ఫోన్ చేశాను. 'అవన్నీ చర్చిద్దాం, సాయంత్రం ఆరు గంటలకు ఆఫీసుకు ర'మ్మన్నాడు. నిర్మలనీ రమ్మన్నాను. "మధ్యన నే నెందుకు, పిలవని పేరంటం? మీ సాహిత్య గోష్ఠి పుణ్యమా అని ఆ చంద్రశేఖర్‌తో సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యం సాధిస్తావేమో! అతను 'ఎలిజిబుల్ బ్రైడ్‌గ్రూం'ట. వెళ్ళిరా. ఆల్ ద బెస్ట్! సాయంత్రం సత్యం కారు తీసుకొస్తాడు" అంది.

నే నెక్కడ మొహమాటపడి వెళ్ళిపోతానో అని, నేను వద్దన్నా వినకుండా అయిదింటికల్లా కారు పంపింది. డ్రైవర్ సత్యం నన్ను చూసి "హమ్మయ్య! ఉన్నారు కదా! 'తొరగా వెళ్ళు, లేకపోతే బస్సులోనో, ఆటోలోనో బయల్దేరుతుంది' అంటూ నన్ను తరిమేరండి అమ్మాయిగారు" అన్నాడు.

ఇంకా టైముంది కదా అని లోపలికెళ్ళి ప్లేట్లో టిఫిన్ పట్టుకొచ్చి సత్యానికిచ్చి కూర్చుని తినమన్నాను- అది చూసి లోపలి కొచ్చి మా అమ్మ "అదేమిటే! కారు డ్రైవర్‌కి స్టీలు ప్లేట్లో టిఫెనూ? ఇప్పుడు మళ్ళీ స్టీల్ గ్లాస్‌లో మంచి నీళ్ళూనా? పైగా అతని కుల మేమిటో తెలుసా?" అంది. మా అమ్మ అమాయకత్వానికి నవ్వొచ్చింది. నేను బయటకొచ్చేటప్పటికి సత్యం గ్లాసులో మిగిలిన నీళ్ళతో ప్లేటు కడగబోతున్నాడు. ఆ రెండూ అతని చేతుల్లోంచి లాక్కుని, గుమ్మంలో నిలబడ్డ మా అమ్మ చేతుల్లో పెట్టాను- ఆమె ప్రశ్న కిదే సమాధానమన్నట్టు.

కార్లో వెడుతూంటే "అమ్మాయిగారూ! మీ కథ బ్రహ్మాండంగా ఉందండి, నాలుగుసార్లు చదివాను" అన్నాడు సత్యం.

"అందులో ఏమిటి నచ్చింది?" అని అడిగాను.

"అంతా బాగుందండి. అసలు ఆ పత్రికలో మీ కథ కటింగ్ తీసి మా బావకి పంపిద్దా మనుకున్నాను బుద్ధొస్తుందని. మా అక్కయ్య బాధపడుతుం దని ఊరుకున్నాను" అన్నాడు.

సత్యం జీవితం కూడా ఓ కథా వస్తువే. ఇతని తండ్రి హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో కారు డ్రైవరుగా పనిచేస్తూ ఓ ప్రమాదంలో ఏటయ్యా ఏట పోయాడు. అప్పటికి వీళ్ళక్కయ్యకి పద్దెనిమిదేళ్ళు. బియ్యేలో చేరింది. ఇతను పదో తరగతి చదువుతున్నాడు. ఒక అటెండర్ పోస్టులో వీళ్ళక్కయ్యకి ఉద్యోగం ఇచ్చి గుమాస్తాగా పని చేయించుకునేవారు. గ్రాడ్యుయేట్ అయిన తర్వాత ఎల్. డి. సి. గా వేస్తామన్నారు. అమ్మాయి తెలివైంది. పట్టుదలతో బియ్యే ప్రైవేట్‌గా కట్టి పూర్తిచేసింది. ఖాళీ రాగానే ఎల్. డి. సి. ఉద్యోగం ఇచ్చారు. వీళ్ళ తల్లి రోగిష్టిది. గుండెజబ్బట. తను బతికుండగానే అమ్మాయి పెళ్ళి చెయ్యాలన్న ఉద్దేశంతో, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిప్లొమా తీసుకుని, చిన్న వర్క్‌షాప్ నడుపుతున్న యువకుడి కిచ్చి పెళ్ళి చేసింది. కట్నం అనీ, అప్పు అనీ, కొడుక్కి వాటా ఇస్తాను పెట్టుబడి పెట్టమని ప్రావిడెంటు ఫండూ, గ్రాట్యుటీ, ఉన్న కొద్దిపాటి వెండి, బంగారాలు అన్నీ అల్లుడు లాగేశాడు. ఫేమిలీ పెన్షన్‌తో కాలక్షేపం చేస్తుంటే, ఆవిడకి రోగం తిరగబెట్టి గుటుక్కుమంది. అప్పటికి సత్యం ఇంటర్ చివరి సంవత్సరంలో ఉన్నాడు. గత్యంతరంలేక అక్కాబావల వంచన చేరాడు. ఇంటర్ పరీక్షలైన తర్వాత సెలవుల్లో బావగారు వర్క్‌షాపులో పని నేర్చుకోమని సత్యాన్ని బలవంతం చేశాడు. కారు డ్రైవింగ్ కూడా నేర్పి, రెండేళ్ళు తన వర్క్‌షాపులోనే పెట్టుకుని చదువు మానిపించేశాడు. సత్యం తిండికీ, గుడ్డికీ మొహం వాచాడు. అక్క రహస్యంగా చేతిలో డబ్బు పెట్టినా పుచ్చుకునేవాడు కాదు. ఈ రెండేళ్ళలోనూ డ్రైవింగూ, మెకానిజం నేర్చుకున్నాడు. వాటా సంగతేమిటని అడిగితే, సత్యాన్ని ఇట్లోంచి మెడ పట్టుకు గెంటాడు. తెలుసున్న టాక్సీ డ్రైవర్ సహాయంతో పదేళ్ళ క్రితం ఈ విశాఖ పట్నం వచ్చాడు.

"మీ బావ మీ అక్కయ్యనీ, పిల్లల్నీ బాగా చూసుకుంటున్నాడు కదా!"

"మా అక్కనీ, పిల్లల్నీ, మా అక్క డబ్బునీ అన్నీ బాగానే చూసుకుంటున్నాడు. అదొకటే తృప్తి. నేను ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. షెడ్యూల్ కేస్ట్ కోటాలో నాకు ఇంజనీరింగ్‌లో సీటొచ్చేది. దాన్ని గురించి కూడా బాధ లేదు. నేను మొగాణ్ణి. రెక్కల కష్టం చేసి పైకొచ్చాను. నా కే లోటూ లేదు. మా బావ సిగ్గూ, అభిమానం, పౌరుషం లేకుండా అడదాని సొమ్ము కాజేసి, చివరికి మా అమ్మకి వైద్యం కూడా చేయించలేదు. పాపం - మా అక్కయ్య కూడా అదే బాధపడుతుంది. నా కొక్కటే తృప్తి- మా అమ్మ పోయినా, ఆమె కోరిక తీరింది. ఇప్పుడు మా అక్క, బావ, పిల్లలు హాయిగా ఉన్నారు."

"ఇప్పుడైనా మీ బావ మారేడా?"

"ఆహా! ఇప్పుడు బోలెడు ప్రేమ నేనంటే. ఇప్పుడు పెట్టుబడి లేక పోయినా వాటా ఇస్తానంటాడు. ఎందుకంటే, నేను రానని తెలుసు" అన్నాడు సత్యం. అతని ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, మంచితనం చూస్తుంటే చదువు, హోదా కంటే సంస్కారం ఎంత సంతృప్తినిస్తుందో అర్థమౌతుంది.

* * *

సరిగ్గా ఆరు గంటలకి ఆంధ్రవాణి ఆఫీస్‌లో అడుగు పెట్టాను. ఒక్కొక్కళ్లే వెళ్ళిపోతున్నారు. విజిటర్స్ రూంలో నే నొకర్తినే మిగిలాను. పావు తక్కువ ఏడు గంటలకి లోపలికి రమ్మన్నారని కబురొచ్చింది.

"రండి, రండి, ఉమా! ఎలా వున్నావు? ఏం చేస్తున్నావు? కూర్చో" అంటూ చంద్రశేఖర్ పలకరించారు.

"థేంక్స్. బాగానే ఉన్నాను. ప్రైవేటు కాలేజీలో పని చేస్తున్నాను" అన్నాను క్లుప్తంగా.

"అవును, చెప్పేవు బాంక్ టెస్టులూ....సర్వీస్ కమిషన్‌కి అప్లయ్ చేసే నన్నావు!"

"ఇంకా ఫలితాలు రావడానికి టైం పడుతుంది."

"నీ కథ మహిళా సంక్షేమ మంత్రి సరళా కృష్ణమూర్తి గారికి నచ్చింది. ఆవిడ ఆలోచనే ఈ గోష్ఠి. అది సరే, పెళ్ళి మంత్రాల గురించి చాలా చదివిన

ట్టున్నావు. నీ కథలో ఈ పెళ్ళి, తగాంస్క్ని పెళ్ళికొడుకుల్నీ దుయ్యబట్టావు. ఏమిటి విశేషం? నాలాగే పెళ్ళి ప్రయత్నానికి స్వస్తి చెప్పావా? బ్రేవో!"

"ఈ గోష్ఠి తేదీ, స్థలం నిర్ణయించారా?" అన్నాను. ఆయన మొదలెట్టిన ఏకవచన సంబోధన, మాటల ధోరణి నాకు నచ్చలేదు. నన్ను ముప్పావు గంట విజిటర్స్ రూంలో కూర్చోపెట్టాడు. తను ఫ్రెష్‌గా మొహానికి పౌడను రాసుకుని సెంటు పూసుకుని కూర్చున్నట్టు కనబడుతూనే ఉంది.

"లేదు. నిన్ను సంప్రదించి వక్తలని ఎంపికచెయ్యమంది. టూర్ వెళ్ళింది."

"గోష్ఠిలో చేతనయితే పాల్గొంటాను. వక్తల ఎంపిక విషయంలో నాకు అనుభవం లేదు. మీరే ఎంపిక చెయ్యండి. నాకు మంత్రిగారితో పరిచయముంది. ఆ విషయం ఆమెతో చెప్పమంటే చెప్తాను" అన్నాను 'బ్లఫ్' చేస్తూ. నిజానికి ఆమెతో నాకు పరిచయం లేదు.

''నువ్వు నేరుగా మాట్లాడితే బాగుండదు. నేను మాట్లాడి నీకు వివరంగా రాస్తాను. అప్పుడు నువ్వు కావలిస్తే కలవొచ్చు'' అన్నాడు, ఈ గోష్ఠి వ్యవహారం వొట్టి బూటకమన్న నా అనుమానం నిజమని రుజువు చేస్తూ.

''అయితే శెలవు. సరిగ్గా ఏడు గంటలకి పవర్ కట్ కూడా ఉంది. వస్తా" అన్నాను లేచి నిలబడి, రిస్ట్ వాచ్ చూసుకుంటూ.

''కూచో కూచో! మరీ అంత వ్యవహర్తలా ఉంటావనుకోలేదు ఆలస్యమైతే నిన్ను నా కార్‌లో డ్రాప్ చేస్తాను. అంత మంచి కథ రాసిన నీకు డిన్నరైనా ఇవ్వకుండా పంపెయ్యమంటావా?" అంటూండగా లైట్లు ఆరిపోయాయి.

నేను లేచి 'గుడ్‌నైట్' అని రెండడుగులు గుమ్మం వైపు వేశానో, లేదో నా రెండు భుజాల మీదా అతని రెండు చేతులూ పడ్డాయి. గబుక్కుని కూర్చుని చేతులు తప్పించుకుని గుమ్మం దాటి ''మిస్టర్ చంద్రశేఖర్! నాకు కథలు రాయడమే కాదు - కరాటే కూడా వచ్చు. జాగ్రత్త!'' అంటూ బయట కొచ్చాను.

కారిచ్చి పంపినందుకు థేంక్ చేసి, ఈ సంఘటన నిర్మలకి చెప్పాను. ''ఆ రోజున ఎంత మర్యాదగా మాట్లాడాడు! ఇవాళ ఇలా చేస్తాడా రాస్కెల్!'' అంది నిర్మల.

''అది వాడి తప్పు కాదు. ఆడది అంత లోకువయిపోయింది'' అన్నాను.

* * *

నాతోటి కాలేజ్ లెక్చరర్స్ అందరికీ నా పట్ల అభిమానముంది. సాంస్కృతిక కార్యక్రమాలలో నేను ఎక్కువగా పాల్గొంటూండటంవల్ల చాలా మంది నాకీ ఉద్యోగం పెర్మనెంట్ అవాలనీ, నేను వాళ్ళ మధ్య ఉండాలనీ కోరుకుంటున్న వాళ్ళే.

రవీంద్రనాథ్ కాస్త ఎక్కువ సన్నిహితంగా ఉంటూంటాడు. ఇరవై ఏడో, ఇరవై ఎనిమిదో ఉంటుంది వయస్సు. ఇంకా పెళ్ళి కాలేదు. అతనికి ఉన్నతమైన ఆశయాలు, ఆదర్శాలున్నాయి. ఎటొచ్చీ ఆచరణలో సాధించే ఆత్మ విశ్వాసం లేదు. మనిషిది మెత్తని స్వభావం అవడంవల్ల తల్లితండ్రుల వొత్తిడికి లొంగిపోతాడు. ఆర్థిక ఇబ్బందుల్లోంచి బయటపడ్డ మధ్యతరగతి కుటుంబంలో మనిషి. ఈయన ఆశయాలు సంగతెలాగున్నా బోలెడు కట్నాలు పోసి ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసిన తల్లి తండ్రులకి కొడుకు ద్వారా కొంత రాబట్టుకోవాలనుంటుంది కదా! నాకు ఈ ఊళ్లోనే పెర్మనెంట్ ఉద్యోగం దొరికితే బాగుండుననీ, వాళ్ళ వాళ్ళని ఎలాగైనా ఒప్పించి నన్ను పెళ్ళి చేసుకోవాలని ఉన్నట్లూ రెండు మూడుసార్లు సూచించాడు. నేను నవ్వి ఊరుకునేదాన్ని. మనిషి బాగుంటాడు, మంచివాడు, పెర్మనెంట్ జాబ్. ఈ మధ్యనే రెండు సంబంధాలొచ్చాయి. కట్నం లేకపోయినా - లాంఛనాలు, పెళ్ళి ఘనంగా జరిపించాలంటే ఓ సంబంధం వాళ్లు ఒప్పుకున్నారు. కాని, బొత్తిగా 'బాల తొడుగు' లేమీ లేవని వాళ్లు బుకాయించటంతో తప్పిపోయింది. రెండో సంబంధం కుదరకపోవడానికి కారణం పిల్ల గ్రాడ్యుయేటయినా కాదు. పైగా, చాయ తక్కువట. వద్దన్నా బోలెడు కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారుట.

* * *

గ్లాడిస్ ఎంగేజ్‌మెంట్ పార్టీకి వెళ్ళినప్పుడు తనకు కాబోయే భర్త డేవిడ్‌నీ, అన్న మైకేల్‌ని పరిచయం చేసింది. మైకేల్‌ని ఎక్కడో చూసినట్టు గుర్తుంటే పరకాయించి చూస్తుండగా ''మనం కాలేజ్ మేట్స్. నేను బియ్యే చదువుతున్నప్పుడు మీరు ఇంటర్ చదివేవారు. కాలేజ్ డే ఫంక్షన్‌లో నాకు స్పోర్ట్స్‌లో ప్రైజొస్తే, మీకు డిబేట్‌లో వచ్చింది'' అంటూ గుర్తుచేశాడు నవ్వుతూ. మంచి రూపం, వేషం, మాట తీరు - ఎవర్నయినా ఇట్టే ఆకర్షిస్తాయి. ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడుట.

గ్లాడిస్ పెళ్ళి రెండు నెలల తర్వాత సెయింట్ జోసఫ్ చర్చిలో జరిగింది. ఈలోగా తన ఫియాన్సీతోపాటు అన్న మైకేల్‌నీ, నన్నూ రెండు సార్లు డిన్నర్‌కి పిలిచింది. ఓ రోజు డిన్నర్‌కి వెళ్ళేముందు అందరం మైకేల్ కొనుక్కున్న కొత్త త్రీ బెడ్ రూం ఫ్లాట్ చూశాం. మార్బుల్ ఫ్లోరింగ్, ఫైన్ ఉడ్ వర్క్, లేటెస్ట్ మోడల్ శానిటరీ ఫిటింగ్స్‌తో నా కళ్ళకి ఇంద్ర భవనంలా కనబడింది.

గ్లాడిస్ పెళ్ళయిన తర్వాత ఓ రోజున మైకేల్ మా కాలేజీకొచ్చి గ్లాడిస్-డేవిడ్‌లు హనీమూన్ కెడుతున్న సందర్భంగా తను హోటల్ హిల్‌వ్యూలో డిన్నర్ ఏర్పాటు చేశాను రమ్మని బలవంతం చేశాడు. హోటల్ లాంజ్‌లో మైకేల్ నా కోసం వేచి ఉన్నాడు. ఫుల్ సూట్‌లో టిప్‌టాప్‌గా తయారయ్యి చిరునవ్వుతో స్వాగతం పలికాడు. ఆలస్యానికి క్షమాపణ చెప్పుకుంటూ అతని వెనకాలే వెళ్ళాను. రెండే కుర్చీలున్న కార్నర్ టేబుల్ దగ్గర కెళ్ళి కూర్చొ మన్నాడు. ఇటీవల మా పరిచయం స్నేహంగా మారింది.

''గ్లాడిసూ, డేవిడూ ఏరి?'' అడిగాను, కూర్చుంటూ.

''వాళ్లు నిన్ననే కొడైకెనాల్ వెళ్ళిపోయారు. నీతో ఏకాంతంగా మాట్లాడా లని అలా అబద్ధం చెప్పాను'' అన్నాడు తన చక్కని పలు వరస ప్రదర్శిస్తూ.

''పోన్లే అబద్ధమాడేనని నిజం చెప్పావు. ఏకాంతంగా మాట్లాడటానికి ఇది శుభారంభం! సరే, ఏం మాట్లాడాలో మాట్లాడు'' అన్నాను నవ్వుతూ.

''టు ఫ్రూట్ పంచెస్'' అంటూ బేరర్‌కి ఆర్డ రిచ్చాడు. ''అయ్ లవ్ యు'' అన్నాడు బేరర్ వెళ్ళిపోగానే.

''అయామ్ గ్రేటిఫయిడ్'' అన్నాను కుతూహలంగా.

''నువ్వు ఊఁ అంటే గ్లాడిస్ తిరిగొచ్చాక ఫార్మల్ ఎంగేజ్‌మెంట్....''

''ఆ తర్వాత?''

''మంచి రోజు చూసుకుని మేరేజ్, ఆ తర్వాత హనీమూన్. బై ది బై-మొన్న గ్లాడిస్ పెళ్ళిలో సెయింట్ పాల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడాను. మన పెళ్ళి అవగానే నిన్ను వాళ్ళ కాలేజీలో పెరమ్మెంట్ స్టాఫ్ మెంబర్‌గా తీసుకుంటానని హామీ ఇచ్చింది. ఆవిడ మాకు దగ్గిర బంధువు'' అన్నాడు తన దూరదృష్టిని వివరిస్తూ.

"ఇప్పుడు నాకు జాబ్ ఉంది కదా! ఈలోగా ఏ సర్వీస్ కమిషన్‌లోనైనా సెలెక్టయితే...."

"అక్కర్లేదు. ఇందులో అయితే ఫిక్స్‌డ్ టైమింగ్స్, కావల్సినన్ని శలవులు, పైగా, నేను కొనుక్కున్న ఫ్లాట్ కి దగ్గరగా ఉంటుంది. అంచేత రాక పోకలకు ఇబ్బంది లేదు. టైమూ కల్సొస్తుంది."

"అబ్బో! చాలా ముందుగా ప్లాన్ చేశావు!"

"నీదే ఆలస్యం. అంతా సిద్ధం నువ్వు ఊఁ అనాలంతే."

"ఊఁ అనడానికి కొంచెం ఆలోచించాలి కదా - పెళ్ళంటే మాటలా?"

"చూడు ఉమా! పెళ్ళి పేరు చెప్పి నువ్వు పైసా ఖర్చు పెట్టక్కర్లేదు. మరి మీ తల్లిదండ్రులు నువ్వు క్రిస్టియన్ని పెళ్ళాడతానంటే...."

"పెళ్ళాడినంత మాత్రాన నేను మతం మార్చుకోనక్కర్లేదుగా?"

"నువ్వు మతం మార్చుకోవాలి. లేకపోతే మా వాళ్ళు ఒప్పుకోరు. నిజం చెప్తున్నాను. మా ఫ్యామిలీ సర్కిల్స్ నుంచి మంచి సంబంధాలు వచ్చాయి. నేను నిన్ను ప్రేమిస్తున్నాను కనుక."

"మాట వరసకి అడుగుతున్నాను. 'స్పెషల్ మేరేజ్ ఏక్ట్' కింద మనం పెళ్ళి చేసుకున్నామనుకో - అప్పుడు నువ్వు కాని, నేను కాని మతం మార్చుకో అక్కర్లేదుగా!"

"మరి మన పిల్లల సంగతి?"

"వాళ్ళిష్టం వాళ్ళది. నిర్బంధం ఏముంది! వాళ్ళ కేమతం నచ్చితే అదే పుచ్చుకుంటారు."

"అయామ్ సారీ! స్పష్టంగా చెప్పనియ్యి. నా పిల్లలు క్రిస్టియానిటీ తప్ప మరో మతం పుచ్చుకోవడం ప్రసక్తి లేదు "

"అంటే, నాకు గత్యంతరం లేదన్నమాట."

"అది అంతే. బాగా ఆలోచించుకో, టే కిట్ ఆర్ లీ విట్."

"ఆలోచించుకున్నాను. నేను నీ వెంటబడి నన్ను పెళ్ళి చేసుకోమని బతిమాల్లేదే! 'ఐ లవ్ యు' అంటూ నువ్వే నా వెంటబడ్డావు. నిన్నూ, నీ డబ్బునూ, నీ అహంకారాన్నీ ప్రదర్శించుకున్నావు. నిజానికి నన్ను నువ్వు

ప్రేమించలేదు. నిన్ను నువ్వే ప్రేమించుకున్నావు నీకు ధనమదంతో బాటు ఒక పేద పిల్లని పెళ్ళాడానన్న కీర్తి కూడా కావాలి. దానికోసం నా స్వాతంత్ర్యాన్ని నా అభిరుచిని, నా ఉద్యోగాన్ని, నా వాళ్ళని, నా మతాన్ని త్యాగంచేసి దాసోహం అంటూ నీ ప్రేమని స్వీకరించాలి. అవునా?"

"ప్లీజ్ కూల్ యువర్ సెల్ఫ్, టేక్ దట్ ఫ్రూట్ బంచ్."

"అది నీకే ఉంచుకో. దిస్ 'పంచ్' ఈజ్ ఇనఫ్" అంటూ లేచొచ్చాను.

* * *

"ఈ ప్రొపోజల్ గ్లాడిస్ ప్రోత్సాహంతోనే అంకురించి ఉంటుంది. వర కట్నాల పీడ భరించలేక మతాలు మార్చుకోవడం నిత్యం చూస్తూనే ఉన్నాం" అంది నిర్మల.

"దాని తప్పులేదు. నా సమస్యకి తనకి అందుబాటులో ఉన్న పరిష్కార మార్గం చూపెట్టింది. నిజానికి నాకు దైవంలో నమ్మకముంది కాని, ఏ మతం పట్లా ప్రత్యక్షమైన అభిమానం లేదు, ద్వేషం లేదు. నాకు కులం, మతం సమస్యలు కావు. కాని, మైకేల్ నా పేదరికాన్ని అలుసుగా తీసుకుని నా కొక వ్యక్తిత్వం కూడా లేదనుకోడం నేను భరించలేకపోయాను" అన్నాను.

నేను ఎదురు చూసినట్టే నన్ను ఉద్యోగంలో నించి తీసేశారు నాకు ఉద్యోగం లేకపోవడం, గోరుచుట్టు మీద రోకలిపోటులాగ మా అన్నయ్యకి మళ్ళీ ఆడపిల్లే పుట్టడం, ఆర్థిక బాధలు, మధ్య మధ్య వాళ్ళ అనారోగ్యం వీటితో సతమతమవుతూ రెండు నెలలుగా మా అమ్మా నాన్నా నాకు పెళ్ళి సంబంధాలు చూడటం వాయిదా వేశారు. నిర్మలొచ్చి తరచు నన్ను వాళ్ళింటికో, పార్క్‌కో లాక్కుపోయేది. పాపం, దానికి మనశ్శాంతి లేదు. పెళ్ళయి ఆర్నెళ్లు దాటింది. రెండు మూడు నెలల క్రితమే రావాల్సిన 'వీసా' మరో ఆరునెలలక్కాని రాదని దాని భర్త రాశాట్ట. అతను మరో కొత్త కంపెనీలో చేరాడట. అందుచేత ఉద్యోగం కొత్త, స్థలం కొత్త అవడం ఆలస్యమవుతూందట.

ఆ రోజు ఆదివారం పార్క్‌కి వెడదామని నిర్మల చెప్పినట్లు పొద్దున్నే సత్యం కబురు తీసుకొచ్చాడు. చేతిలో ఉన్న స్వీట్ పేకెట్ విప్పుతూ సత్యం నిలబడి ఉండటం చూసి "ఏమిటి విశేషం?" అని అడిగాను.

"శుభవార్త మేడం!" అన్నాడు.

''పెళ్ళి కుదిరిందా?'' అన్నాను నవ్వుతూ.

"ఛ! ఛ! ఇప్పుడు పెళ్లేమిటండి? ముందు కొత్త కారు కొని టేక్సీ లైసెన్స్ తీసుకోవాలి. అప్పుడూ పెళ్ళి సంగతి.''

ఈ ఏడెనిమి దేళ్ళలోనూ ముప్పయ్యయిదు వేల వరకూ దాచుకున్నాడట. మిగతాది బాంక్ అప్పు ద్వారా తీసుకుని కారు కొనాలని అతని ఆశయం.

"బాంక్ లోన్ శాంక్షనయిందా?''

''రెండు నెలల్లో డబ్బు రెడీ అవుతుంది. అప్పుడు అప్లయ్ చేస్తాను.''

''ముందు పెళ్ళి చేసుకో. చదువు ఉంది. సంపాదించుకుంటున్నావు. అందచందాలకి లోటు లేదు. మంచి కట్నమే వస్తుంది. అత్తారు మంచి వాళ్ళయితే బాంక్ వాయిదాలు కూడా వాళ్లే కడతారు.''

''ఇంత బతుకూ బతికి ఆడదాని సొమ్ము ఆశించమంటారా? నాకూ, మా బావకీ తేడా ఏమిటి?'' అన్నాడు తెరిచిన స్వీట్ పేకెట్ నా ముందుంచి.

''మరి శుభవార్తేమిటో చెప్పు.''

''మా అక్కయ్యకి యుడిసిగా ప్రొమోషన్ వచ్చినట్లు టెలిగ్రాం వచ్చింది''అంటుంటే సత్యం మొహంలో వెలిసిన ఆనందరేఖలు చూస్తుంటే ఇంత మంచి తమ్ముడున్న అక్క ఎంత అదృష్టవంతురాలు అనిపించి రెండు స్వీట్స్ తీసుకున్నాను.

''థేంక్స్ మేడమ్!'' అన్నాడు రెట్టింపు సంతోషంతో,

* * *

నాకు బాంక్‌లో ప్రొబేషన్ ఆఫీసర్‌గా సెలక్షన్ వచ్చిందని తెలియగానే మా ఫ్రెండ్స్ అందరినీ పిలిచి నిర్మల చేసిన హడావిడితోనూ, మా అమ్మా నాన్నల వార్తా ప్రసార సంరంభంతోనూ, బంధు మిత్రుల అభినందనలతోనూ, నా చుట్టూ ఉన్న భూమి ఆనందంతో కంపించిందా అనిపించింది. ఫలితాలకోసం ఎదురు చూడటంతో అలస్యానికి విసుగెత్తి పోవడం వల్ల నిర్లిప్తత ఆవరించింది కాని, నేను ఎంపిక అవుతానన్న నమ్మకం నాకెప్పుడూ ఉంది.

నాకు ఫస్ట్ పోస్టింగ్ భువనేశ్వర్ ఇచ్చారు రీజినల్ మేనేజర్‌ని కలుసుకున్నాను. జాయినింగ్ రిపోర్టు ఇచ్చాక, మర్యాదకి, వెంటనే చేరినందుకు నన్ను అభినందిస్తూ ఆరు నెలల తర్వాత నేను అడిగినా, అడక్కపోయినా గుర్తుంచుకుని ఆంధ్రప్రదేశ్‌కి, వీలైతే విశాఖపట్నానికే బదిలీ చేస్తానని వాగ్దానం చేశాడు. ఆడపిల్లల తండ్రయి ఉంటాడు. నా పేరు ముందర 'కుమారి' చూసుంటాడు. "థేంక్స్" చెప్పి ఆయన ఆశీస్సులు తీసుకున్నాను.

ముప్పయ్యేళ్ళబట్టి అలవాటైన ఊరు అరమరికలు లేని ఇరుగూ పొరుగూ, పైగా పెద్ద వయస్సు కనుక మా అమ్మా నాన్నా విశాఖపట్నంలోనే ఉంటామన్నారు. భువనేశ్వర్‌లో మా బాంక్‌లోనే పనిచేస్తున్న ఉద్యోగస్తుడి ఇంట్లో పేయింగ్ గెస్టుగా చేరాను. వాళ్ళు చాలా మంచివాళ్ళు. పొద్దున్న ఇంటి వాళ్ళ పిల్లలకి ఫ్రీ ట్యూషనూ, సాయంత్రం మహిళా సంక్షేమ సంఘం కార్యక్రమాలతోనూ రోజులుదొర్లిపోతున్నాయి. నే నిక్కడి కొచ్చి మూడు నెలలైంది. తరచు నిర్మల మా బాంక్‌కి టెలిఫోన్ చేస్తూ విశేషాలు చెబుతుంది. నన్ను కంగ్రాచ్యులేట్ చేస్తూ, నే నంగీకరిస్తే భేషరతుగా నన్ను పెళ్ళి చేసుకోడాని కిప్పుడు సిద్ధంగా ఉన్నట్టు రవీంద్రనాథ్ ఉత్తరం రాశాడు.

నేను ఆఫీసర్నయ్యేను కనుక కాస్త పెద్ద సంబంధాలకే ప్రయత్నిస్తూనట్లు, కాని కట్నాల రేటు ఏమి తగ్గేట్టు లేదని, పెళ్ళికి బాంకులో అప్పు ఇస్తారా, ఇస్తే ఎంత ఇస్తారో బ్యాంకులో కనుక్కుని చెప్పమని మా నాన్న ఉత్తరం రాశారు. ఆయన ధోరణి ఆయనిది.

మన సమాజంలో ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల్లో కొన్ని కరుడు కట్టిన దురభిప్రాయా లున్నాయి. అందుకే పెళ్ళి ఒక సమస్యగా ఘనీభవించింది. అమ్మాయి మెట్రిక్ అయితే అబ్బాయి గ్రాడ్యుయేట్ అయి ఉండాలి, అమ్మాయి గ్రాడ్యుయేట్ అయితే అబ్బాయి పోస్ట్ గ్రాడ్యుయేట్ అయి ఉండాలి. అమ్మాయి పోస్టు గ్రాడ్యుయేట్ అబ్బాయి డాక్టరేట్ అయితే బాగుంటుంది. అమ్మాయి సంపాదన నెలకి రెండు వేలయితే అబ్బాయి సంపాదన మూడు వేలయినా ఉండాలి. డబ్బు సంపాదించే యంత్రం లాగా అబ్బాయి సామర్థ్యాన్నిబట్టి కట్నం రేటుంటుంది, ఫారిన్ రిటర్న్ పెళ్ళి కొడుకయితే రేటు అనంతం. ఇంతా అంతా అనిలేదు ఇవ్వగలిగినంత. ఆడదాన్ని తోటి మనిషిగా గుర్తించి గౌరవించే సంస్కారం, విశాల భావాలు ఉన్నాయా. లేవా అనేటటువంటి మాన

వతావిలువలు పట్టించుకోరు. అంచేత మా నాన్నగారు నా కోసం చేసే పెళ్ళి ప్రయత్నాల గురించి నేను వాదించను. వద్దని వారించను ఫలితం శూన్యమని నాకు తెలుసు.

నిర్మల ఫోన్‌చేసింది. ''రవీంద్రనాథ్ నీకోసం ఇక్కడ తపస్సుచేస్తున్నాడు నువ్వు ప్రత్యక్షమయ్యే వరకూ నిద్రాహారాలు త్యజించాడు నీ సిఫార్సు హామీ ధర్మమా అని సత్యానికి లోన్ వచ్చింది. సోమవారం సాయంత్రం షోరూం కెళ్ళి కారు తీసుకుంటాడు. కారు నువ్వే కొనిపెట్టినంత సంబరపడిపోతూ ఆ రోజుకి నువ్వెలాగైనా రావాలని చెప్పమన్నాడు. ముందు నీకూ, తర్వాత దేవుడికీ కొబ్బరి కాయ కొడతాడట. మీ అక్కయ్యకి మొగ పిల్లాడు పుట్టిన శుభ సందర్భంలో మీ అమ్మా నాన్న విజయవాడ వెళ్ళారు. అంచేత వెర్రి వెర్రి వేషాలు వెయ్య కుండా బుద్ధిగా కోణార్కలో దిగుతున్నావు. మా ఇంట్లో ఉంటావు. నీ సమా ధానం అక్కర్లేదు. స్టేషన్‌కి నేనే స్వయంగా వచ్చి దేవిగార్ని రిసీవ్ చేసుకుంటాను. ఇది నా ఆజ్ఞ'' అని రిసీవర్ పెట్టేసింది.

నేను విశాఖపట్నం టెలిగ్రాం ఇవ్వడంతో మా అమ్మా నాన్నా కూడా నే నొచ్చేటప్పటికే తిరిగొచ్చారు. నేను వస్తున్న సందర్భంలో మా స్నేహితులు అందరినీ పిలిచి నిర్మల వాళ్ళ తోటలో పార్టీ ఏర్పాటు చేసింది. సాయంత్రం వరకూ అందరం సరదాగా గడిపాం. తిరిగొచ్చాక రాత్రి వాళ్ళింట్లోనే భోం చెయ్యాలని నిర్బంధం చేసింది. నే నంటే దానికి పిచ్చిఅభిమానం. ''నువ్వు వత్తి పెంకి ఘటానివి. ఆశయాలు గాడిద గుడ్డూ అంటూ చివరకి నవ్వుల పాలవుతా వేమోనని నా భయం'' అని పైకి అన్నా దాని అంతరంగంలో నా పద్ధతే సరైం దేమో నన్న అభిప్రాయం లేకపోలేదు.

''రవీంద్రనాథ్‌కి నువ్వొస్తున్నట్లు కాని, వచ్చినట్టు కాని తెలీదు. నువ్వొ స్తావని చెప్పలేదు. దిక్కుమాలిన సస్పెన్సూ నువ్వూను! మొన్నటి వరకూ ఫోన్లు మీద ఫోన్లు కొట్టి నా ప్రాణాలు తోడేశాడు. ఆ శుభవార్త నీ నోటితో నువ్వే చెప్పు, రమ్మని పిలుస్తాను'' అంది నిర్మల.

''వద్దు. రేపు పొద్దున్న బాంక్‌కి వెళ్ళాలి. మధ్యాహ్నం షోరూంకి వెళ్ళి కారు ఎంపిక చేసుకోవాలి. సాయంత్రం గుడి కెళ్ళాలి. రోజంతా బిజీగా ఉంటాం. అంచేత రవీంద్రనాథ్‌ని కల్సుకోటానికి ఎల్లుండే ముహూర్తం పెట్టుకున్నాను. ఈ లోగా నోరు మూసుకో'' అన్నాను.

''మంగళవారం రాత్రి నువ్వే చెక్కేస్తావు. అతను దొరక్కపోతే?''

"బుధవారం నా తరపున సకల మర్యాదలు చేసి సవినయంగా నా నిర్ణయాన్ని తెలియచెయ్యి - గుడ్‌నైట్!'' అన్నాను, ఇంటికి వెళ్ళడానికి లేచి. మధ్యాహ్నం నుంచీ మా అమ్మ నాన్నా నా కోసం ఎదురు చూస్తూ ఉంటారన్న ఆలోచన రాగానే కాళ్ళు నిలబడలేదు.

* * *

పొద్దున్నే కారు హారన్ విని బయట కొచ్చాను. చేతిలో చిన్న గిఫ్ట్ పేకట్‌తో శోభ దిగింది,

''త్వరలో భార్యవి కాబోతున్నావట కదా! అదృష్టవంతురాలివి. కంగ్రాట్స్!'' అంది.

''నీ కెవరు చెప్పారు?" అని అడిగాను. ఇది అసలే చాటర్‌బాక్స్. దాని వరకూ ఈ వార్త పాకిందంటే వేరే ప్రచార సాధనాలు అవసరం లేదు.

''నిర్మల చెప్పింది. పెళ్ళి కొడు కెవరంటే ఆ విషయం ఇంకా పెళ్ళి కొడుక్కే తెలియదు అంది."

''ఆ విషయఆ రహస్యంగా ఉంచమన్నానని చెప్పలేదా?''

"నాకూ రహస్యంగానే చెప్పిందే, తల్లీ! నీ పట్టుదల, నీ సాహసం అభినందిస్తున్నాను ఫెలోషిప్ మీద స్టేట్స్‌కి వెడుతున్నాను. విదేశీ వ్యవహారాల శాఖలో క్లియరెన్స్‌కోసం ఢిల్లీ బయల్దేరి వెడుతున్నాను. ఈ విషయం నిర్మలకి ఫోన్‌చేసి చెప్తే అది నువ్విక్కడే ఉన్నావని చెప్పింది, మళ్ళీ ఎప్పుడొస్తానో, వస్తానో-రానో తెలీదు. అంచేతనే పెళ్ళికిక్కడ ఉండనందుకు నీ శాపం తగలకుండా ఈ చిరుకానుక సమర్పిద్దామని వచ్చాను" అంటూ ఆ పేకట్ నా చేతిలో పెట్టింది.

"థేంక్స్! మీ అందరి స్నేహమే నా ఆస్తి. పెళ్ళికి వచ్చి ఆశీర్వదిస్తే సంతోషించే మనసుంది కాని రాకపోతే అలిగే అధికార మే ముంది?" అన్నాను దాన్ని ఆప్యాయంగా కౌగలించుకుంటూ. మా ఇద్దరి కళ్ళూ చెమ్మగిల్లాయి ఆ క్షణంలో దాని క్కావల్సినంత ఐశ్వర్యం, తెలివి తేటలు, చదువు, సంస్కారం చక్కని శరీర సౌష్ఠవం ఉన్నాయి. కాని, ఏ జన్మలో పాపమో! ఒంటి మీద

బొల్లి మచ్చలొచ్చాయి. అది అంటువ్యాధి కాదు, కేవలం చర్మంలో పిగ్మెంట్ లోపించడం అని డాక్టర్లు చెబుతారు. దాని వల్ల బొల్లి మచ్చలున్న మొగాడికి పెళ్ళవుతుంది. కాని, ఆడదానికి కాదు! శోభ పెళ్ళిపోయాక పేకట్ విప్పి చూశాను. పాతిక ముప్పయి వేలు ఖరీదుచేసే బంగారు గొలుసు!!

* * *

నిర్మల కారులో నిర్మల, నేను, సత్యం బయల్దేరి షోరూంకి వెళ్ళి శల్య పరీక్షచేసి కారు ఎంపిక చేశాం. అక్కణ్ణుంచి గుడికి వెళ్ళేటప్పుడు నిర్మల తన కారు డ్రైవ్ చేస్తుంటే, కొత్తకారు సత్యం డ్రైవ్ చేస్తుంటే అతని పక్కన కూర్చున్నాను.

"సొంత కారు కొన్నాక పెళ్ళి చేసుకుంటా నన్నావు. పిల్లని చూసుకున్నావా?" అడి అడిగాను

"కారు మీరే కొనిపెట్టారు. పిల్లనీ మీరే చూసిపెట్టాలి" అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

"నీకో పిల్లని చూశాను. మరి నీకు నచ్చుతుందో, లేదో!"

"మీకూ, నిర్మలగారికి నచ్చితే నాకు నచ్చినట్టే."

"పిల్ల ఓ మాదిరిగా ఉంటుంది. చదువు, సంస్కారం ఉన్నాయి."

"ఏదో చిన్న ఉద్యోగమైనా ఉండాలమ్మా. నేను టాక్సీమీద తిరుగుతూంటాను. ఏ ఏక్సిడెంటయినా అయితే...."

"ఉద్యోగం చేసుకుంటుంది; పెర్మనెంట్ ఉద్యోగం - మధ్య మధ్య బదిలీలు ఉంటాయి."

"నో ప్రాబ్లమ్. ఆ అమ్మాయి కెక్కడికి బదిలీ అయితే అక్కడే నా టాక్సీ నడిపించుకుంటాను. ప్రస్తుతం ఆ అమ్మాయెక్కడుందండి?''

"ఇక్కడే-నీ పక్కనే!" అన్నాను సత్యం భుజం మీద చెయ్యివేసి.

నిర్ఘాంతపోయి కారు పక్కకి తీసి ఆపేశాడు.

"ఏమిటి మీ రనేది? అందరిలోనూ మీరు చాలా తెలివైనవారు, పెద్ద చదువు చదివారు, మంచి ఉద్యోగం సంపాదించుకున్నారు....''

''తెలివైన దాన్నని నువ్వే ఒప్పుకుంటూ నే నేదో తెలివి తక్కువగా మాట్లాడిన ట్లలా ఆశ్చర్యపోతా వేమిటి!''

''రేపట్నుంచి మీరు తలెత్తుకు తిరగ్గలరా?''

''గర్వంగా నా మొగుడు మొగాడనీ, నేను తెలివైన దాన్ననీ తెలిసే లాగ చేస్తాను.''

''అసలు మా కులమేదో తెలుసా? మేము....''

''మ నిద్దరిదీ మానవ కులం. స్వార్థం, సంకుచిత్వం, అహంకారమున్న వాళ్ళకే ఈ కల్పితమైన కులాల పట్టింపులు. నీ మంచితనం, సంస్కారం, ఆత్మవిశ్వాసం నాకు తెలుసు. నీది మాధవ కులం.''

''అమ్మో!''

''ఉమా అను.''

''మీ అమ్మగారూ, నాన్నగారూ ఒప్పుకుంటారా?''

''తల్లి తండ్రులుగా వాళ్ళని పూజిస్తాను. నా నిర్ణయాన్ని కాదనే అధి కారం వాళ్ళకి లేదు. ఇలా అవడానికి కారణం వాళ్ళ అసమర్థతే అని వాళ్ళని వాళ్ళు తిట్టుకుంటూ బాధపడతారు. తర్వాత సమాజ శ్రేయస్సుకిది సహజ పరి ణామమని గ్రహించి ఆశీర్వదిస్తారు."

''నిర్మల గారి కిది తెలుసా?''

''అదిగో, కారు దిగొస్తూంది, దాన్నే అడుగు'' అన్నాను.

''త్వరగా పదండి. నడి రోడ్డుమీద ఈ గాంధర్వ వివాహమేమిటి? గుడి కెళ్ళిం తర్వాత కొత్తకారు పేరుచెప్పి రెండు కొబ్బరికాయలు, పెళ్ళి పేరుచెప్పి రెండు కొబ్బరికాయలు కొట్టాలి. పదండి పదండి'' అంటూ హెచ్చరించి వెళ్ళి నిర్మల కారు స్టార్ట్ చేసింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-9-92)